అంతర్ జిల్లా దొంగల పట్టివేత

- ముగ్గురి అరెస్ట్
- పరారీలో మరో నలుగురు

నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న కారు, ద్విచక్ర వాహనం, ఇన్వర్టర్‌తో పోలీసులు

మానకొండూర్, ఫిబ్రవరి 11: వ్యవసాయ బావుల వద్ద కరెంట్ మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి తీగను దొంగిలిస్తున్న అంతర్ జిల్లా ముఠా మానకొండూర్ పోలీసులకు చిక్కింది. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ రాజ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. మండలంలోని గట్టుదుద్దెనపల్లి శివారులో ఈ నెల 10న ఓ ట్రాన్స్‌ఫార్మర్‌లోని 41 కిలోల రాగి తీగను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు చెంజర్ల సబ్‌స్టేషన్ ఏఈ రమేశ్ మానకొండూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శనివారం సాయంత్రం మానకొండూర్ చెరువు కట్ట వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టగా, కరీంనగర్ వైపు వెళ్తున్న కారు (టీఎస్ 21 డీ 7715)లో ఇద్దరు వ్యక్తులు, కారు వెనుకాలే ద్విచక్ర వాహనంపై వస్తున్న ఒకరు పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. పోలీసులు వారిని స్టేషన్‌కు తరలించి విచారించారు. విచారణలో మానకొండూర్‌కు చెందిన కోండ్ర ప్రణీందర్ అలియాస్ ప్రన్వి, కరీంనగర్‌లోని సుభాష్‌నగర్‌కు చెందిన నెరువట్ల వెంకటేశ్, నెరువట్ల అజయ్, రాంనగర్‌కు చెందిన పార్వతం సతీశ్ ముఠాగా ఏర్పడి వివిధ జిల్లాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నట్లు అంగీకరించారు. వీరు దొంగిలించిన రాగి తీగ, ఇతర సామగ్రిని మానకొండూర్‌లోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన సిరిగిరి వెంకటమ్మ, కరీంనగర్‌లోని అలకాపురి కాలనీకి చెందిన టేకు మల్లేశం, కోతిరాంపూర్‌కు చెందిన లోకిని మల్లేశంకు విక్రయిస్తున్నట్లు వెల్లడించారు. వీరిపై కరీంనగర్, పెద్దపల్లి, సిద్దిపేట జిల్లాల్లోని ఆయా పోలీస్‌స్టేషన్లలో 27 కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. నిందితులు కోండ్ర ప్రణీందర్, నెరువెట్ల వెంకటేశ్, పార్వతం సతీశ్ నుంచి కారు, ద్విచక్ర వాహనం, ఇన్వర్టర్, టేబుల్, టేబుల్ ఫ్యాన్, 10 కిలోల రాగి వైర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులతో పాటు దొంగిలించిన రాగి, ఇతర సామగ్రిని కొనుగోలు చేసిన వారిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ముగ్గురు నిందితులను మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించగా, మిగతా నలుగురు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. అంతర్ జిల్లా దొంగలను పట్టుకున్న సీఐ రాజ్‌కుమార్, సిబ్బందిని పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు.

పారదర్శకంగా ఈవీఎంల ఎఫ్ఎల్‌సీ

ఈవీఎంల ఎఫ్ఎల్‌సీని పరిశీలిస్తున్న డీఆర్‌వో, రాజకీయ పార్టీల ప్రతినిధులు

కలెక్టరేట్, ఫిబ్రవరి 11: ఈవీఎంల మొదటి స్థాయి తనిఖీలు పారదర్శకంగా చేపడుతున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి పవన్‌కుమార్ తెలిపారు. నగరంలోని గోడౌన్‌లో నిర్వహిస్తున్న ఈవీఎంల ఎఫ్ఎల్‌సీ విధానాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఫస్ట్ లెవెల్ చెకింగ్ సాగుతోందన్నారు. కార్యక్రమంలో ఆయా పార్టీల ప్రతినిధులు మడుపు మోహన్, సత్తినేని శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, కళ్యాడపు ఆగయ్య, తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని 30 గొర్రెలు మృతి

చిగురుమామిడి, ఫిబ్రవరి 11: మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ వద్ద ఆదివారం రాత్రి గ్రానైట్ లారీ ఢీకొని 30 గొర్రెలు మృతి చెందాయి. చిగురుమామిడి నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న గ్రానైట్ లారీ గొర్రెల మందపై దూసుకెళ్లడంతో గొర్రెలు మృతి చెందినట్లు యజమానులు దరి కనకయ్య, ముదురు సమ్మయ్య తెలిపారు. తమ జీవనాధారమైన గొర్రెలు మృతి చెందాయని, తమకు లారీ యజమానులు న్యాయం చేయాలని కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

గంగాధర, ఫిబ్రవరి 11: చెర్లపల్లి(ఆర్) మున్నూరుకాపు సంఘం కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వేల్పుల రాములు, ఉపాధ్యక్షుడిగా అమిరిశెట్టి రాజారాం, ప్రధాన కార్యదర్శిగా అమిరిశెట్టి మాదన్న, సహాయ కార్యదర్శిగా పూదరి గంగయ్య, కోశాధికారిగా ఎట్టెపు చిన్న మల్లయ్య ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని సంఘం సభ్యులు సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో సంఘం మాజీ అధ్యక్షుడు నర్సయ్య, సభ్యులు పాల్గొన్నారు.

కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలి

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శంకర్, నాయకులు

హుజూరాబాద్‌టౌన్, ఫిబ్రవరి11: ఈ నెల 16న అఖిల భారత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా తలపెట్టిన కార్మికుల సమ్మె గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్, నాయకులు కోరారు. ఆదివారం హుజూరాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ సర్కారు అవలంబిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ సంఘాల నాయకులు రాచర్ల మల్లేశం, బోయినపల్లి రమాపతిరావు, శనిగరపు కొమురయ్య, రవీందర్‌రావు, కండే సదయ్య, కొత్తూరు మల్లయ్య, కదం కిషన్‌రావు, కాశిపాక శంకర్, లక్ష్మీనారాయణబాబు, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీవీకి 'భారతరత్న'పై హర్షం

సైదాపూర్, ఫిబ్రవరి 11: మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు ప్రభుత్వం భారత రత్న పురస్కారాన్ని ప్రకటించడంపై బీఆర్ఎస్ మండల నాయకుడు పోలు ప్రవీణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పీవీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మానకొండూర్ రూరల్, ఫిబ్రవరి 11: మానకొండూర్ మండలం శంషాబాద్ స్టేజీ సమీపంలో వరంగల్-కరీంనగర్ ప్రధాన రహదారిపై ఆదివారం తెల్లవారు జామున గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. గ్రామస్తులు, గ్రామ పంచాయతీ పంప్ ఆపరేటర్ ఎండీ హకీం పాషా పోలీసులకు సమాచారం అందించగా, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి వివరాలు తెలియరాలేదు. పంచాయతీ పంప్ ఆపరేటర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజ్ కుమార్ తెలిపారు.

విద్యారంగానికి అన్యాయం

తెలంగాణ చౌక్, ఫిబ్రవరి 11: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించడంపై ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన తెలిపారు. తెలంగాణ చౌక్‌లో ఆదివారం కళ్లకు గంతలు కట్టుకొని ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్, నాయకులు అరవింద్, మనోజ్, బొగేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్ విద్యానగర్ 'ముకాస' అధ్యక్షుడిగా అమర్ బాబు

కార్యవర్గాన్ని అభినందిస్తున్న మున్నూరు కాపు సంఘం బాధ్యులు

విద్యానగర్, ఫిబ్రవరి 11: నగరంలోని విద్యానగర్‌లో ఆదివారం గ్రేటర్ విద్యానగర్ మున్నూరు కాపు సంఘం ఎన్నికలు నిర్వహించారు. కాగా, అధ్యక్షుడిగా అమర్ బాబు, పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులను సంఘం గౌరవాధ్యక్షుడు కొండపల్లి సతీశ్ అభినందించారు. ఎన్నికల అధికారులుగా పోరెడ్డి నరేందర్ పటేల్, కామ అంజిబాబు పటేల్, పెద్దపల్లి లక్ష్మణ్ పటేల్ వ్యవహరించారు. త్వరలోనే నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఉంటుందని కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు అమర్ బాబు మాట్లాడుతూ, తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

మహిళా శక్తి సమ్మేళనంలో మాట్లాడుతున్న వక్తలు

ఘనంగా మహిళా శక్తి సమ్మేళనం

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 11: జిల్లా కేంద్రంలోని తీగలగుట్టపల్లి రెడ్డి ఫంక్షన్ హాల్‌లో మహిళా శక్తి సమన్వయ సమితి కరీంనగర్ విభాగ్ ఆధ్వర్యంలో మహిళా శక్తి సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మహిళా శక్తి సమ్మేళన సమితి రాష్ట్ర బాధ్యులు, సామాజిక కార్యకర్తలు లింగం ఉజ్వల, జొన్నలగడ్డ నాగశ్రీ శారదాంబ, ఆధ్యాత్మిక వేత్త మాధవీలత హాజరై మాట్లాడారు. నేటి సమాజంలో పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. డాక్టర్ శేష శైలజ, బొడ్ల గీతారాణి, కోడూరి శ్రీవాణి, లెక్కల గీతారెడ్డి, డాక్టర్ ఆకుల శైలజ, ముక్క రాజశ్రీ, డాక్టర్ నందికొండ, లక్ష్మీరెడ్డి, కంజర్ల శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్యలో వార్షికోత్సవ సంబురాలు

మాట్లాడుతున్న విద్యా సంస్థల చైర్మన్ రమేశ్ రెడ్డి

తిమ్మాపూర్, ఫిబ్రవరి 11: ఎల్ఎండీ కాలనీలోని శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాల, కరీంనగర్ లోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలల్లో ఆదివారం రాత్రి వార్షికోత్సవ సంబురాలు అట్టహాసంగా నిర్వహించారు. వేడుకలను విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల నృత్యాలు, కేరింతలతో ప్రాంగణమంతా హోరెత్తింది. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ నరేందర్ రెడ్డి, డీన్ జగన్మోహన్ రెడ్డి, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

చిగురుమామిడి, ఫిబ్రవరి 11: నల్గొండ జిల్లాలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో మండల కేంద్రంలోని డార్విన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారు. బుర్ర కరుణాకర్ బంగారు పతకం, అశ్విక్ రజతం, గూడెపు విక్రమ్, బుర్ర నితేశ్ కాంస్య పతకం సాధించారు. రాష్ట్ర జేకేఏ షోటోకాన్ కరాటే చీఫ్ రాపోలు సుదర్శన్ పతకాలతోపాటు సర్టిఫికెట్లు అందజేశారు. ఇక్కడ కరాటే మాస్టర్ బండారిపల్లి రమేశ్, నిర్వాహకులు, విద్యార్థులు ఉన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేస్తున్న నిర్వాహకులు

బడి 'పిల్లల కోసం'

- తామున్నామంటున్న డిగ్రీ కళాశాల విద్యార్థులు
- ప్రత్యేక కార్యక్రమం ద్వారా సందేహాల నివృత్తి
- ఫలితమిస్తున్నది అంటున్న అధ్యాపకులు

విద్యార్థులకు సూచనలు ఇస్తున్న వలంటీర్

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 11: ప్రాథమిక స్థాయి విద్యలో గుణాత్మకమైన మార్పు తీసుకురావడానికి రాష్ట్ర కళాశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాల విద్యాశాఖ చేపట్టిన 'తొలిమెట్టు' కార్యక్రమానికి అనుబంధంగా కళాశాల విద్యాశాఖ 'పిల్లల కోసం' కార్యక్రమం విజయవంతంగా నిర్వహిస్తున్నది. 'పిల్లల కోసం' స్వచ్ఛంద సంస్థతో అవగాహన ఒప్పందం మేరకు అప్పటి కళాశాల విద్యాశాఖ కమిషనర్ వాకాటి కరుణ సారథ్యంలో డిగ్రీ చదువుతున్న ప్రభుత్వ కళాశాలల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఇందులో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వారు ప్రాథమిక పాఠశాలల్లో సరిగ్గా చదవడం, రాయడం రాని 15 మంది విద్యార్థులను దత్తత తీసుకుని స్నేహపూర్వకమైన బోధనకు ముందుకు వచ్చారు. వీరు 'మనమందరం ఎవరి కోసం..?, మనమంతా పిల్లల కోసం' అనే నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 10,000 మంది వలంటీర్లు ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతున్నారు. తెలుగు, ఇంగ్లిష్, గణితం విషయాలకు సంబంధించిన నైపుణ్యాలను ప్రాథమిక స్థాయి విద్యార్థులకు స్నేహ పూర్వకంగా బోధిస్తున్నారు. పాఠశాలలో మూడు, నాలుగు, ఐదో తరగతి చదువుతున్న వెనుకబడిన విద్యార్థులకు ప్రతి శనివారం ఆటపాటలతో బోధన చేపడుతున్నారు.

ప్రతి శనివారం విద్యాబోధన..

జిల్లాలో గత నవంబర్ నుంచి జిల్లా విద్యాధికారి కార్యాలయ సీఎంవో ఆంజనేయులు సహకారంతో ప్రతి శనివారం వలంటీర్లకు కేటాయించిన ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు బోధిస్తున్నారు. ఇందులో కరీంనగర్ నుంచి 120 మంది, హుజూరాబాద్ నుంచి 20 మంది, జమ్మికుంట నుంచి 84 మంది ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఇందులో పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమం మార్చి నెల మూడో శనివారంతో ముగస్తుండగా, వలంటీర్లు విద్యార్థులకు తమదైన రీతిలో సలహాలు, సూచనలు అందిస్తూ ముందుకుసాగుతున్నారు. అయితే, ఇందులో భాగస్వాములైన వలంటీర్లకు పాఠశాల విద్యా శాఖ నుంచి చివరి వారంలో సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్నారు.

నేను కూడా నేర్చుకుంటున్నా

పిల్లలకు ప్రతి శనివారం ఒక విషయాన్ని అర్థమయ్యేలా వివరించేందుకు నేను కూడా నేర్చుకొని వెళ్లాల్సి వస్తున్నది. ఇందుకోసం నేను ముందు చాలా సాధన చేస్తున్నా. ఓపికతో, ప్రేమగా చెబితేనే చిన్నారులు నేర్చుకుంటున్నారు. ఇది నాకు ఎంతో ఉపయోగపడుతున్నది. ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం అటు చిన్నారులతో పాటు తమకు ఆనందంగా ఉంది.

– పోతు సాయికృష్ణ, బీఎస్సీ, ఎంపీసీఎస్

ఆనందంగా ఉంది

ఆటపాటలతో అర్థమయ్యేలా చిన్నారులకు పాఠాలు నేర్పడం ఆనందంగా ఉంది. మేం చదువుకునే రోజుల్లో ఇలా మాకు చెప్పేవారు లేరు. కానీ, ఇప్పుడు చిన్నారులకు చాలా విషయాలు అర్థమయ్యేలా చెబుతుంటే ఆ లోటు మాకు తెలుస్తున్నది. ఇలాంటి కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించడం గొప్ప విషయం.

– జీ సురేశ్, బీఎస్సీ, ఎంపీసీఎస్

స్ఫూర్తిదాయకంగా కొనసాగుతున్నది

కళాశాల విద్యాశాఖ కమిషనర్ ప్రోత్సాహం మేరకు రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న పిల్లల కోసం కార్యక్రమం పది వారాలుగా స్ఫూర్తి దాయకంగా కొనసాగుతున్నది. ఈ కార్యక్రమం విజయవంతం చేయడానికి ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, జిల్లా నోడల్ అధికారి టీ రాజయ్య, జిల్లా సమన్వయకుడు డాక్టర్ వీ వరప్రసాద్, జిల్లా విద్యా శాఖ కార్యాలయ సీఎంవో ఆంజనేయులు తమవంతు కృషి చేస్తున్నారు.

– డాక్టర్ కే రామకృష్ణ, కార్యక్రమం జిల్లా పర్యవేక్షకుడు

వలంటీర్లతో స్నేహపూర్వకమైన బోధన

జిల్లా వ్యాప్తంగా 224 మంది వలంటీర్లు ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతున్నారు. వలంటీర్లు పిల్లలతో మమేకమై స్నేహపూర్వకమైన సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. ప్రతి శనివారం వారికి కేటాయించిన ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల్లో మార్పునకు కృషి చేస్తున్నారు.

– టీ రాజయ్య, జిల్లా నోడల్ అధికారి

శ్రద్ధగా వింటున్నరు

పిల్లలకు ఆటపాటలతో పాఠాలు నేర్పిస్తున్నా. ఇంట్లో సొంత తమ్ముళ్లకి, చెల్లెళ్లకి చెప్పినట్లు అనిపిస్తున్నది. ప్రతి వారం క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చి పాఠాలు బోధిస్తున్నం. పిల్లలు కూడా శ్రద్ధగా వింటున్నారు.

– అనూష, బీఎస్సీ ద్వితీయ సంవత్సరం

ప్రాణం తీసిన స్పీడ్ బ్రేకర్

స్వరూప(ఫైల్)

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 11: భర్తతో కలిసి వాహనంపై వెళ్తున్న మహిళ పాలిట స్పీడ్ బ్రేకర్ మృత్యుపాశమైంది. ప్రమాదవశాత్తూ వాహనంపై నుంచి జారి పడడంతో తీవ్రగాయాలపాలైన ఆమె, చికిత్స పొందుతూ మృతిచెందింది. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. హుజూరాబాద్ మండలం కాట్రపల్లికి చెందిన ముప్పు స్వామి సుతారి మేస్త్రీ. భార్య స్వరూప, ముగ్గురు పిల్లలతో కలిసి పట్టణంలోని 12వ వార్డు అహల్యనగర్‌లో నివాసం ఉంటున్నాడు. వారం క్రితం స్వామి తన ద్విచక్ర వాహనంపై స్వరూప(45)ను వెంటబెట్టుకొని పరకాలకు పనిమీద వెళ్లి తిరిగి వస్తుండగా, కమలాపూర్ గ్రామ శివారులోని సబ్‌స్టేషన్ ఎదుట ఫోర్‌లేన్ రోడ్డుపై నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన స్పీడ్ బ్రేకర్ వద్ద ప్రమాదానికి గురయ్యారు. స్పీడ్ బ్రేకర్ పరిమితికి మించి ఎత్తుగా ఉండడం, స్వామి ఆలస్యంగా గమనించి ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో బైక్ వెనుకాల కూర్చున్న స్వరూప జారి రోడ్డుపై పడింది. తలకు తీవ్ర గాయాలు కావడంతో వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. స్వరూప చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందగా, కుటుంబంలో విషాదం నెలకొన్నది.

గ్యాస్ లీకై మంటలు అంటుకొని వృద్ధురాలు మృతి

హుజూరాబాద్ రూరల్, ఫిబ్రవరి 11: జూపాక గ్రామంలో సిలిండర్ గ్యాస్ పైప్ లీకై మంటలు అంటుకొని తీవ్రంగా గాయపడిన పెద్దోజు నాగమ్మ (75) చికిత్స పొందుతూ మృతిచెందింది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు.. నాగమ్మ శనివారం సాయంత్రం ఇంట్లో సిలిండర్‌పై వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు గ్యాస్ పైప్ లీకై మంటలు అంటుకున్నాయి. ఆమె అరుపులు విన్న ఇంటి సమీపంలోని వారు వచ్చే సరికే నాగమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం ఆమెను హుజూరాబాద్ ప్రభుత్వ దవాఖానలో చేర్పించారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

తెలంగాణను ఎడారిగా మార్చేందుకు కాంగ్రెస్ కుట్ర

కలెక్టరేట్, ఫిబ్రవరి 11: గోదావరి జలాలతో సస్యశ్యామలమైన తెలంగాణను ఎడారిగా మార్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నిందని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొండం అనంతరాములు ఆరోపించారు. నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 13న నల్లగొండలో నిర్వహించే బీఆర్ఎస్ బహిరంగ సభకు తెలంగాణ రైతు సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో నాలుగు బస్సుల్లో వెళ్లనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రఘునాయకుల రాజారెడ్డి, కీర్తి వెంకటేశం, సారబుడ్ల వెంకటరమణారెడ్డి, మల్యాల రాములు, దురిశెట్టి ఆంజనేయులు, బోయినపల్లి వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఐఎంఏ ప్రెసిడెంట్ కప్ విజేత సిటీ టైటన్స్ జట్టు

ఐఎంఏ ప్రెసిడెంట్ కప్ సాధించిన సిటీ టైటన్స్ జట్టు

విద్యానగర్, ఫిబ్రవరి 11: బొమ్మకల్‌లోని బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్ మైదానంలో ఐఎంఏ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో నిర్వహించిన ఐఎంఏ ప్రెసిడెంట్ కప్ విజేతగా సిటీ టైటన్స్ జట్టు నిలిచింది. రన్నరప్‌గా సన్‌రైజర్స్ జట్టు నిలిచింది. పోటీల స్పాన్సర్లుగా రెనే, లైఫ్ లైన్, ఆదర్శ, సిటీ, సన్‌రైజ్ దవాఖాన, కేసీ డయోగ్నొస్టిక్ సెంటర్ యాజమాన్యాలు వ్యవహరించాయి. కార్యక్రమంలో ఐఎంఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ పొలాస రామ్‌కిరణ్, డాక్టర్ జీ వెంకట్‌రెడ్డి, స్పోర్ట్స్ కమిటీ చైర్మన్ డాక్టర్ జక్కని తిరుపతి, సీనియర్ వైద్యులు డాక్టర్ రఘురామన్, డాక్టర్ మోహన్‌రెడ్డి, డాక్టర్ రఘునాథ్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శనకు సింగాపూర్ విద్యార్థిని

బోరు ప్రమాదాల నివారణకు రూపొందించిన ప్రాజెక్టుతో వైష్ణవి

హుజూరాబాద్ టౌన్/ రూరల్, ఫిబ్రవరి 11: సింగాపూర్ జడ్పీహెచ్ఎస్ పదో తరగతి విద్యార్థిని బీ వైష్ణవి రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ మనాక్ ప్రదర్శనకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు బీ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బోర్ బావి ప్రమాదాలను నివారించేందుకు విద్యార్థిని రూపొందించిన ఇన్నోవేషన్ ప్రాజెక్ట్ ఇప్పటికే జిల్లా స్థాయిలో పలువురి ప్రశంసలు అందుకున్నదని, రాష్ట్ర స్థాయికి అర్హత సాధించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని బీ వైష్ణవితో పాటు గైడ్ టీచర్ ఎల్ రాంప్రసాద్‌ను ప్రధానోపాధ్యాయుడు బీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

టీపీఏఎస్ఏ అడహక్ కమిటీ రాష్ట్ర కార్యవర్గం

టీపీఏఎస్ఏ అడహక్ కమిటీ ఎన్నిక

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 11 : తెలంగాణ ప్రభుత్వ పాలిటెక్నిక్ అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ అసోసియేషన్ (టీపీఏఎస్ఏ) అడహక్ కమిటీ రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లోని టీఎన్‌జీవో కేంద్ర కార్యాలయంలో రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల సభ్యులు సమావేశమయ్యారు. ముఖ్య అతిథిగా టీఎన్‌జీవో హైదరాబాద్ నగర అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు హాజరుకాగా, సంఘం రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా కే ఈశ్వర్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా హనీఫ్ అహ్మద్, కోశాధికారిగా గోలి సంతోష్‌కుమార్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా పీ విశ్వప్రసాద్, ఎం కృష్ణ వ్యవహరించారు.

హుజూరాబాద్‌ను పీవీ జిల్లాగా మార్చేందుకు కృషి

అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నినదిస్తున్న ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

హుజూరాబాద్ టౌన్/ ఇల్లందకుంట, ఫిబ్రవరి 11: హుజూరాబాద్‌ను పీవీ జిల్లాగా మార్చడానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ పేర్కొన్నారు. ఎమ్మెల్సీగా నియామకమైన అనంతరం ఆదివారం ఆయన మొదటిసారిగా నియోజకవర్గానికి రాగా, పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికాయి. హుజూరాబాద్‌లో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్, నాయకులు గజమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ, హుజూరాబాద్ అభివృద్ధికి రూ.50 లక్షలు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. దళితబంధు పథకం అమలు కోసం కృషి చేస్తానన్నారు. అనంతరం ఇల్లందకుంటలోని సీతారామచంద్రస్వామి ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉప కేంద్ర భవనానికి శంకుస్థాపన

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 11: నగరంలోని 8వ డివిజన్ (అల్గునూర్)లో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణ పనులకు ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అల్గునూర్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సల్ల శారద-రవీంద